క్లుప్తంగా

అన్నదానం



అన్నదానం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బ్లెసిన్ జయంతి సందర్భంగా పార్టీ నాయకులు, అతని మిత్రులు, కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపుపవిత్రారెడ్డి హాజరై అన్నదానం చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



సత్యవేడు: మండల పరిధిలోని మాదనపాళెం పాఠశాలలో పని చేస్తూ శిరుణంబూదూరుకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు డి.సురేష్‌ను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం సాయంత్రం పాఠశాలలో ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ఎంపీడీఓ చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంఖ్యను పెంచడం, ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులను చేర్పించడంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. హెచ్‌ఎం మునిమోహన్ పాల్గొన్నారు.

2న జాతీయ సమ్మేళనం

ఏర్పేడు: చలో నెల్లూరు జైహో 2వ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని జైభారత్, జైహో కార్యకర్త మహేష్ కోరారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 19న నెల్లూరు పట్టణ సమీపంలోని పల్లిపాడు గ్రామంలో సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తును తరలిరావాలని పిలుపునిచ్చారు. జైభారత్, జైహో కార్యకర్తలు రాబర్ట్, బాలసుబ్రమణ్యం,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం



కెమికల్ క్యాన్లను అందజేస్తున్న ఎంఈఓ

సత్యవేడు: విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎంఈఓ కె.రవి అన్నారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో బాత్‌రూం, మరుగుదొడ్లు, తరగతి గదుల క్లీనింగ్‌కు వినియోగించే కెమికల్‌ను హెచ్‌ఎంలకు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండల పరిధిలో 58 పాఠశాలకు అవసరమైన పరికరాలు అందించామని, ప్రస్తుతం లిక్విడ్ కెమికల్స్ సరఫరా చేస్తున్నామన్నారు. ఎంఈఓ టూ ఉషా, ఉపాధ్యాయులు ఈబీ. గురునాథం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా మధ్యాహ్న భోజనం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన భోజనం పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. పదార్థాల రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.

అందుబాటులో ఎరువులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉందని, కావలసిన రైతులు తీసుకుపోవచ్చునని మండల వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ నాగార్జున కంపెనీ యూరియా బస్తా రూ.270కే అందిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగ మేళాలో 25 మంది ఎంపిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జేకేసీ, క్వెస్ కార్పొరేషన్, గ్లోబల్ భారత్ హెచ్‌ఆర్ సొల్యూషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 25మంది ఎంపికయ్యారు. మొత్తం 40మంది మేళాకు హాజరయ్యారు. వీరు టీవీ మ్యాను ఫ్యాక్చరింగ్, వివిధ బ్యాంకుల్లో క్రెడిట్ కార్డు సేల్స్ పర్సన్స్‌గా ఎంపికయ్యారు. వీరికి నెలకు రూ.13వేలు నుంచి రూ.20వేలు వరకు వేతనం లభించనుంది. ప్రిన్సిపల్ ఎం.శ్రీలత, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు చీరల వితరణ



పిచ్చాటూరు: పిచ్చాటూరు ఇందిరానగర్‌కు చెందిన పాస్టర్ శేఖర్ రామగిరి ఎస్టీ కాలనీ పేద మహిళలకు క్రిస్మస్‌ను పురస్కరించుకుని శుక్రవారం చీరలను వితరణగా అందజేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మారుమూల పల్లెలకూ ప్రభుత్వ సేవలు



కసిమ్మిట్ట సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: ప్రభుత్వ సేవలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి మారుమూల పల్లెల్లోనూ అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. రూ.42 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన కసిమ్మిట్ట సచివాలయ నూతన భవనాన్ని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఉదయం ఆయన ప్రారంభించారు. సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కార్యాలయంలో పూజలను నిర్వహించారు. అనంతరం ఆదిమూలం మాట్లాడుతూ పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ సేవలను పల్లెల్లో ప్రతి గడప వద్దకు చేర్చడంలో భాగంగా సీఎం జగనన్న సచివాయల వ్యవస్థను ప్రారంభించారని గుర్తు చేశారు. సచివాలయాల్లో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వలంటీర్ల ద్వారా ఇంటి నుంచే అన్ని సేవలను పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. పల్లెల్లో ప్రభుత్వ భవనాలను నిర్మిస్తూ, ప్రత్యేక గుర్తింపును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని తెలిపారు. ఇలాంటి సంక్షేమ పాలన కావాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శశికళ, మునికుమారి, మురుగేశం, సాయిరవి, ధర్మలింగం, సుబ్రమణ్యంరెడ్డి, రామ్మూర్తి, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ బాబు, తహసీల్దార్ ప్రమీల, మండల పరిషత్ ఏవో గుణశేఖర్, పీఆర్ డీఈ మధుసూదన్, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు అయ్యప్ప, రమేష్, అన్నాదొరై, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.

స్వాగత ఆర్చి నిర్మాణానికి భూమి పూజ



ఏపీ సీడ్స్ వద్ద భూమి పూజలో అంజూరు శ్రీనివాసులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగా తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలో వెలసిన శ్రీఅగస్తీశ్వరాలయం వద్ద స్వాగత ఆర్చి నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోను ఆధ్యాత్మికశోభ విరాజిల్లేలా దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి ఆర్చిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఈఓ వేణుగోపాల్‌రెడ్డి, స్థపతి కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్ వద్ద శివ సర్కిల్ నిర్మాణం

శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపీసీడ్స్ వద్ద శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శివ సర్కిల్‌కు శుక్రవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో శివుడు ధాన్య ముద్రలో ఉండే విధంగా విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో నాయుడుపేట బైపాస్ వద్ద నందీశ్వరుడు, ఎంజీఎం కూడలి వద్ద భక్తకన్నప్ప విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీసీడ్స్ సర్కిల్ వద్ద రూ.5లక్షల వ్యయంతో శివుని ధ్యానముద్ర విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అధికారులు వేణుగోపాల్, కుమార్, బాలాజీ, కాంట్రాక్టర్ బాబు, మాజీ కౌన్సిలర్ గిరి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు శ్రీసిటీ–శ్రీవాణి ప్రథమ వార్షికోత్సవం

సత్యవేడు: శ్రీసిటీ ఆధ్యాత్మిక వేదిక 'శ్రీవాణి' ప్రథమ వార్షికోత్సవం శ్రీసిటీలో శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. బిజినెస్ సెంటర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ భక్తి సాహిత్య స్వరాంజలి కార్యక్రమం నిర్వహించనున్నారు. టీటీడీ ఎస్వీబీసీ ఛానల్ చైర్మన్ డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర, టీటీడీ శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య భూమన కుసుమ కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని, శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తురాలైన వెంగమాంబ జీవిత విశేషాలను, స్వామిపై ఆమె రచించిన గేయాలు, పద్యాలు, యక్ష గానాలను వివరించనున్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పిచ్చాటూరు: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌ను సీఐ లక్ష్మీనారాయణతో కలిసి డీఎస్పీ వార్షిక తనిఖీ చేశారు. ఏడాదికి సంబంధించిన కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిలోని చిన్న చిన్న లోటుపాట్లను వెంటనే పూర్తి చేయాలని ఎస్ఐ వెంకటేశ్వర్లును ఆదేశించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఏడాది పాటు జరిగిన సంఘటనల రికార్డులు సక్రమంగా ఉన్నాయా అని చూడడమే వార్షిక తనిఖీ ముఖ్య ఉద్దేశమన్నారు. కేవీబీ పురం ఎస్ఐ సునీల్, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది, ఏఎస్ఐ రాజు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం





శ్రీకాళహస్తి: సంక్షేమ పథకాల బ్రోచర్‌ను చూపుతున్న ప్రజలు, ఏర్పేడు: ఇంటింటి ప్రచారంలో నాయకులు

శ్రీకాళహస్తి: పేద ప్రజల అభ్యున్నతి కోసం జగనన్న రాష్ట్రానికి మరో సారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నోడల్ ఆఫీసర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 28, 29 వార్డుల సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ సంతోషం శాశ్వతం కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అలాగే మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. 28, 29 వార్డులకు సంబంధించి 4,235మంది జనాభా ఉంటే రూ.25.76కోట్లు పథకాల ద్వారా అందిందని తెలిపారు. పార్టీ నాయకుడు జయగోపాల్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పేడు: పేదల సంక్షేమమే అజెండాగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తవీరాపురంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ప్రారంభించారు.

పెరిందేశంలో విషజ్వరాలు



మూలనపడి ఉన్న ఫాగింగ్ మిషన్

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం దళితవాడలో విషజ్వరాలు భయపెడుతున్నాయి. పారిశుధ్య లోపంతో పాటు వర్షపు నీరు నిల్వ ఉంటుండడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. గ్రామంలో డ్రైనేజీ వసతి లేని కారణంగా ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు కూడా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పారిశుధ్య పనులను అధికారులను పట్టించుకోవడం లేదు. ఫాగింగ్ మిషన్ ఉన్నా, దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు లేవు. ఎంపీడీఓ రామచంద్రను వివరణ కోరగా, విషయం తన దృష్టికి రాలేదని, పారిశుధ్య పనులు చేపట్టి, ఫాగింగ్ చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష వీడాలి

శ్రీకాళహస్తి: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులపై వివక్ష వీడాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో స్టెప్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ మేనేజరు రమేష్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన ఎయిడ్స్, క్షయ, క్యాన్సర్, హైపటైటీస్ బీ తదితర వ్యాధులకు కారణాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 2017 ఎయిడ్స్ నియంత్రణ నివారణ చట్టం ప్రకారం వ్యాధిగ్రస్తులకు, వారి కుటుంబాలకు కల్పించిన సౌకర్యాలను వివరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబం పట్ల సానుభూతితో మెలగాలని సూచించారు. సంస్థ సిబ్బంది గాయత్రి, సునీత, కళావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పనుల కొలతలు పక్కాగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకంలో కూలీలు చేస్తున్న పనుల కొలతలు పక్కాగా ఉండాలని ఏపీఓ భానుప్రియ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మేట్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ కూలీల పనుల కొలతలు, మస్టర్లు వేయడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కూలీలకు రూ. 257 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈసీ మధుసూదనరావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విపత్తు బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం



నారాయణవనం: తుపాన్ బాధితులకు నగదును అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



ఏర్పేడు: నగదును అందజేస్తున్న మోహన్‌రెడ్డి

నారాయణవనం: మిచాంగ్ తుపాన్ బాధితులను ప్రభుత్వం తక్షణం ఆదుకుంటోందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. తుపాన్ ప్రభావంతో కసిమ్మిట్ట సచివాలయ పరిధిలోని నష్టపోయిన బాధితులకు శుక్రవారం ఆయన పరిహారం అందజేశారు. సచివాలయ పరిధిలోని బొప్పరాజుపాళ్యం, కసిమ్మిట్ట పంచాయతీల్లోని 14 కుటుంబాలకు ఒక్కరు ఉన్న కుటుంబానికి రూ.1000, ఇద్దరు ఉంటే రూ 2,000, ముగ్గురు లేదా అంతకన్నా ఎక్కువ మంది ఉన్న కుటుంబాలకు రూ.3 వేల చొప్పున అందజేసినట్లు తెలిపారు. తహసీల్దార్ ప్రమీల మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఇళ్లు, పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు.

పరిహారం పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్‌తో పనులు లేక అవస్థలు పడిన లక్ష్మీపురం గిరిజన కాలనీలో 19 కుటుంబాలకు చెందిన 42 మంది బాధితులకు ప్రభుత్వం అందించిన పరిహారాన్ని పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వీఆర్ఓ మోహన్, ఉప సర్పంచ్ మునిరాజా పరిహారాన్ని అందజేశారు. బాధితులకు రూ.వెయ్యి చొప్పున అందజేశారు.

ఏర్పేడు: మండలంలోని పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో శుక్రవారం మిచాంగ్ తుపాన్ బాధితులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు కన్నలి మోహన్‌రెడ్డి శుక్రవారం నగదును అందజేశారు. తుపాన్‌కు కాలనీలో 16 పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. ఒక్కో బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.2500 మంజూరు చేసింది. అలాగే మండలంలోని మేర్లపాక ఎస్టీ కాలనీలో దెబ్బతిన్న 5 ఇళ్లకు సంబంధించి బాధితులకు సర్పంచ్ గంగాధరం పరిహార నగదును అందజేశారు.

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మిచాంగ్ తుపాన్ బాధితులకు శుక్రవారం పరిహారం అందజేశారు. తొట్టంబేడు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బయ్య బాధితులకు రూ.1000 వంతున నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ సమయంలో బాధితులను స్వయంగా కలుసుకుని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు భరోసా ఇచ్చారన్నారు వీఆర్వో మునికుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





బీఎన్‌కండ్రిగ: నగదు అందుకుంటున్న బాధితులు, తొట్టంబేడు: బాధితులకు నగదు పంపిణీ

అరణియార్ తూము గండి పూడ్చివేత



పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ ఎడమ తూము కాలువ ఆక్వాడెక్ పనులను శుక్రవారానికి పూర్తి చేసినట్లు ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. గత వారం తుపాన్ కారణంగా వరదనీరు ఉధృతంగా ప్రవహించి అరణియార్ ఎడమ తూము ఎదురుగా ఉన్న అక్వాడెక్‌కు గండి పడింది. ఈ తూము ద్వారా రామగిరి, నాగలాపురం మండల రైతుల పొలాలకు నీరు సరఫరా కావాల్సి ఉంది. అక్వాడెక్‌కు గండి పడడంతో తమ పంట పొలాలకు నీరందడం లేదని ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే ఆదిమూలంకు విన్నవించారు. యుద్ధప్రాతిపదికన పూడ్చి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్‌కు సూచించారు. స్పందించిన ఇరిగేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన పూడ్చి ఆయకట్టు రైతుల పంటపొలాలకు నీటిసరఫరా సమస్యకు పరిష్కారం చూపారు.

శబరిమలకు బయలుదేరిన ఎమ్మెల్యే మధు



శబరిమలైకు బయలుదేరుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అయ్యప్పమాల ధరించి శుక్రవారం శబరిమల యాత్రకు నియోజకవర్గ నాయకులతో కలిసి బయలుదేరారు. ముందుగా శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రంగుల గోపురం వద్ద శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఇరుముడి కట్టుకుని యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు ఉన్నం వాసునాయుడు, బర్రి హేమ భూషణ్‌రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని ఆందోళన



రాచర్ల వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

వరదయ్యపాళెం: పరిహారం చెల్లించాలని అపోలో పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన రైతులు శుక్రవారం రాచర్ల వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బందిల బాలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో రైతులు మాట్లాడుతూ 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అపోలో పరిశ్రమ కోసం తాము భూములు కోల్పోయామని, అప్పటి నుంచి రాచర్లకు చెందిన 75 మంది రైతులకు సంబంధించి ఇప్పటివరకు పరిహారం అందలేదన్నారు. తమ అనుభవంలో ఉన్న భూములకు 'సి' కేటగిరీలో పరిహారం ఇస్తే, ఆ పరిహారానికి తాము అంగీకరించలేదని, 'ఏ' కేటగిరీకి సంబంధించి ఎకరాకు రూ. 6.50 లక్షలు చొప్పున చెల్లించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ద్వారా జిల్లా కలెక్టర్‌కు విన్నవించామన్నారు. కలెక్టర్ అంగీకరించి ఫైల్ సిద్ధం చేయమని తహసీల్దార్‌ను ఆదేశించినా 6 నెలలుగా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ షణ్ముగం సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. తహసీల్దార్ గౌరీశంకరరావుతో ఫోన్‌లో మాట్లాడించారు. వారం రోజుల్లో ఫైల్ సిద్ధం చేస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చేయూత

- అపోలో పరిశ్రమ ప్రతినిధులు
- చిన్న పాండూరులో రూ. 62.24లక్షలతో 158 మరుగుదొడ్ల నిర్మాణం



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్

వరదయ్యపాళెం: తమ పరిశ్రమ పరిధిలోని గ్రామాల్లో సీసీఆర్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అపోలో పరిశ్రమ యూనిట్ హెడ్ ఆనంద్ సత్యమూర్తి వెల్లడించారు. మండలంలోని చిన్న పాండూరు పంచాయతీలో సీసీఎస్ నిధులు రూ.62.24లక్షలతో 158 మరుగుదొడ్లను నిర్మించారు. శుక్రవారం మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా దృక్పథంతో పేద ప్రజలకు చేయూతనిచ్చిన అపోలో పరిశ్రమ యాజమాన్యానికి స్థానిక సర్పంచ్ శ్యామల ప్రభుత్వం ద్వారా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం పాదిరికుప్పం అరుంధతివాడలో నిర్మించిన మరుగుదొడ్లను ప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. చిన్న పాండూరు ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ల్యాండ్ స్కేపింగ్ ద్వారా పార్క్ అభివృద్ధి చేయాలని స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు వారికి విన్నవించారు. ఈ సమస్యలను పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ఆర్ హెడ్ రాజామోహన్, ముత్తురామన్, లైజనింగ్ ఆఫీసర్ సాయిబాబా, సీఎస్ఆర్ ఇన్‌చార్జ్ లీఫన్, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి, ఉపసర్పంచ్ మహేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



మాట్లాడుతున్న ఇందిరాప్రియదర్శిని

నగరి: బాలికలకు విపత్కర పరిస్థితిల్లో ఆత్మరక్షణకు కరాటే లాంటి విద్య ఉపయోగపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మహిళా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆత్మరక్షణ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన అంశాలను కరాటే మాస్టర్ గోపి డెమో నిర్వహించి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. విజయాలు సాధించాలంటే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని తెలిపారు. కరాటే లాంటి విద్యలు నేర్చుకోవడం వల్ల ఆకతాయిలకు బుద్ధిచెప్పవచ్చన్నారు. మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఎ.ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ అఘాయిత్యాలను ఎదుర్కోనేందుకు బాలికలు సిద్ధంగా ఉండాలని, ఇందుకు ఆత్మరక్షణ విద్యలు అవసరమని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.అరుణకుమారి, డాక్టర్ సుహాసిని, ప్రేమ్‌కుమార్ (పీడీ), విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మాధవి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బందితో వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిందని తెలిపారు. గతంలో రూ.5 లక్షలు ఉండేదని, దీన్ని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు పలు రకాల వ్యాధులను చేర్చినట్లు పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.

సచివాలయ సిబ్బందిచే పౌష్టికాహారం పంపిణీ



నారాయణవనం: బొప్పరాజుపాళ్యంలో సూచనలిస్తున్న తహసీల్దార్ ప్రమీల



రేణిగుంట: గాజులమండ్యం కేంద్రం తాళాలు పగులగొడుతున్న తల్లిదండ్రులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం పంచాయతీ దేశమ్మనగర్, గాజులమండ్యం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను తల్లిదండ్రులు పగులగొట్టి సచివాలయ సిబ్బంది ద్వారా పాఠశాలను నడిపించారు. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె బాటపట్టిన విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా రేణిగుంట మండలంలోని 58 అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార పంపిణీకి ఆటంకం కలుగుతుండడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా తాత్కాలికంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. అయితే సచివాలయ సిబ్బంది అడిగినా అంగన్‌వాడీ టీచర్లు స్కూల్ తాళాలు ఇవ్వకుండా యూనియన్ లీడర్ల వద్ద ఉన్నాయంటూ చెప్పారు. దీంతో మండలంలోని గాజులమండ్యం అంగన్‌వాడీ కేంద్రం వద్దకు శుక్రవారం ఉదయం చిన్నారుల తల్లిదండ్రులు చేరుకుని తాళాలు పగులగొట్టారు. ఆ తర్వాత సచివాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు భోజన వసతి

నారాయణవనం: సమ్మె కారణంతో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించి, పిల్లలకు సమీప పాఠశాల్లో అధికారులు భోజన వసతి కల్పించారు. శుక్రవారం మండలంలోని పాఠశాలలను అధికారుల బృందం సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసింది. తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్యకర్తల సమ్మెతో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధుల సమక్షంలో తెరిపించామని తెలిపారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న జగనన్న గోరుముద్ద ముడి సరుకుల పంచనామా నిర్వహించి, సమీప పాఠశాల్లో మధ్యాహ్న భోజన వసతిని కల్పించామని అన్నారు.